www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 మార్చి 2023

5

పశ్చిమ గోదావరి

చలో ఢిల్లీ జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి - పాలకోడేరు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు అసిరయ్య అన్నారు. శృంగవృక్షం, పెన్నాడ గ్రామాల్లో ఢిల్లీకి తరలి రావాలని కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. సంఘం మండల ఉపాధ్యక్షులు సుబ్బారావు, నేతలు కొటికలపూడి శ్రీను, మనోహర్, యేసు, చిన్న, వెంకన్నబాబు పాల్గొన్నారు.

నీటి శుద్ధత ఎక్కడ..!

యథేచ్ఛగా వాటర్‌ప్లాంట్ల దోపిడీ

నిబంధనలు పూర్తిగా గాలికి

కలుషిత నీరే దర్జాగా విక్రయాలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

రెండు జిల్లాల్లోనూ నెలకు రూ.30 కోట్లకుపైనే వ్యాపారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో తాగునీటి వ్యాపారం రోజురోజుకీ పెరిగిపోతోంది. వేసవి ప్రారంభం కానుండటంతో తాగునీటి పేరిట అడ్డూఅదుపు లేకుండా దోపిడీకి తెరలేచింది. వాటర్‌ప్లాంట్లలో నిబంధనల అమలులో అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమవ్వడంతో ప్రజలు తమ ఆరోగ్యం ఫణంగా పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తక్కువగా లెక్కించినా దాదాపు 500కుపైగా తాగునీటి ప్లాంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో 39 లక్షలు జనాభా ఉండగా పది లక్షల వరకూ కుటుంబాలు ఉన్నాయి. ఆక్వా చెరువుల కారణంగా తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. ముఖ్యంగా డెల్టాలో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. జనం పూర్తిగా వాటర్‌ప్లాంట్ల నీటిపైనే ఆధారపడుతున్నారు. దీంతో వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. వాటర్‌ప్లాంట్లలో 20 లీటర్ల తాగునీటిని కొన్నిచోట్ల రూ.పదికి, మరికొన్నిచోట్ల రూ.20, ఇంకొన్ని ప్లాంట్లలో రూ.30కూ విక్రయిస్తున్నారు. జిల్లాలో ఆరు లక్షల కుటుంబాలుకుపైగా జనాభా వాటర్‌ప్లాంట్లలో నీటినే వినియోగిస్తున్నట్లు అంచనా. ఆ ప్రకారం లెక్కిస్తే సరాసరిన ఒక్కో కుటుంబం రోజుకు రూ.20 చొప్పున తాగునీటికి కేటాయించినా నెలకు రూ.36 కోట్ల వరకూ జనం తాగునీటి కోసం ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇంత పెద్దమొత్తంలో జనం వాటర్‌ప్లాంట్లలో నీటిని వినియోగిస్తున్నప్పటికీ వాటిపై అధికారుల పర్యవేక్షణ అనేది తూతూమంత్రంగా నెలకొంది. నిబంధనల ప్రకారం వాటర్‌ప్లాంట్లలో ఐఎస్ఐ నిబంధనలు పాటించాల్సి ఉంది. అయితే ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు. ఐఎస్ఐ నిబంధనల ప్రకారం వాటర్‌ప్లాంట్ నిర్మించాలంటే రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఖర్చవుతుందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం నడుస్తున్న వాటర్‌ప్లాంట్లలో అత్యధికం రూ.మూడు లక్షలు పైబడి పెట్టుబడితో ఏర్పాటు చేసి నడిపించేస్తున్నారు. ఐఎస్ఐ నిబంధనలు పాటిస్తూ నడుస్తున్న వాటర్‌ప్లాంట్లు జిల్లాలో వేళ్లపైనా లెక్కించొచ్చు. వాటర్‌ప్లాంట్లలో నీరు తాగితే కాళ్ల నొప్పులు వంటివి పెరిగిపోతున్నాయంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచిగాని, అధికారుల నుంచి సరైన స్పందన లేకుండాపోయింది. ఏదైనా ఫిర్యాదు అందితే తప్ప కనీసం వాటర్‌ప్లాంట్లలో తనిఖీలు అనేవి సైతం ఎక్కడా కానరావడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా రాజకీయ నాయకులు రంగంలోకి దిగి సమస్య బయటికి రాకుండా నొక్కేస్తున్న పరిస్థితి గ్రామాల్లో కొనసాగుతోంది.

నాణ్యతా ప్రమాణాలేవీ..!

వాటర్‌ప్లాంట్ల ఏర్పాటు చేయాలంటే పరిశ్రమల శాఖతోపాటు పలు శాఖల అనుమతులు తీసుకోవాలి. నీటిని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పరీక్షలు చేసి అనుమతి ఇవ్వాలి. వాటర్‌ప్లాంట్ల ఏర్పాటులో నిబంధనలు పెద్దగా అమలు కావడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని తోడేస్తున్నారు. ఆర్వో ప్లాంట్లలో తాగునీటి నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. తాగునీటి ప్లాంట్లలో ముందుగా నీటిని క్లోరినేషన్ చేయాలి. తర్వాత ప్రత్యేకమైన శాండ్‌ఫిల్టర్ ద్వారా వడపోయాలి. ఆపై కార్బన్ ఫిల్టర్స్, మైక్రాన్ ఫిల్టర్స్ శుభ్రం చేసి కంపార్టుమెంట్‌లోకి పంపాలి. ఆఖరి దశలో ఆక్సిజన్‌ను పంపి ఆక్సీకరణ చేయాలి. ఈ దశలో మినరల్స్‌ను జత చేయాలి. ఎక్కడా ఈ విధమైన నీటి శుద్ధత జరగడం లేదు. వాటర్‌ప్లాంట్‌లో నీరు సురక్షితం కాదని వైద్యులు సైతం సూచిస్తున్నారు. నిబంధనల ప్రకారం లీటర్ తాగునీటిలో 150 నుంచి ఉంచి 600 వరకూ మినరల్స్ ఉండాలి. వాటర్‌ప్లాంట్లలో నీటిలో 30 నుంచి 40 వరకూ మాత్రమే మినరల్స్ ఉంటాయని తెలుస్తోంది. వాటర్‌ప్లాంట్లలో నీరు తాగితే దీర్ఘకాలంలో తీవ్ర ఆనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు జనం వాపోతున్నారు. పంట కాలువల్లో నీరు ఆక్వా సాగుతో కలుషితం కావడంతో జనాలకు వాటర్‌ప్లాంట్లలో నీరే దిక్కుగా మారింది. ఇంతపెద్దమొత్తంలో నీటి విక్రయాలు సాగిస్తున్న వాటర్‌ప్లాంట్లపై నిరంతరం తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తాగునీటి వాటర్‌ప్లాంట్లపై దృష్టి సారిస్తే జనాలకు మేలు జరిగే అవకాశం ఉంది.

ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ తీరుపై ప్ల కార్డులతో సిపిఎం, సిపిఐ నేతల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఎం, సిపిఐ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం ప్ల కార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలకు తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల స్నేహపూర్వక ధోరణితో కాకుండా కక్షసాధింపు ధోరణులతో దాడులకు పాల్పడుతున్నాయన్నారు. పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరిస్తామని పాదయాత్ర సందర్భంలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 'మాట తప్పను.. మడమ తిప్పను' అని చెబుతూనే ఇచ్చిన హామీని గాలికొదిలేసారని విమర్శించారు. నేటికీ సిపిఎస్‌ను ఎందుకు రద్దు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒపిఎస్ బదులు జిపిఎస్‌ను అమలు చేస్తామనడం దారుణమన్నారు. జిపిఎస్ అంటే అది జీరో పెన్షన్ స్కీమ్ అని బలరాం ఎద్దేవా చేశారు. ఒపిఎస్‌నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న పిఆర్‌సి, వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే వామపక్షాలు ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాయని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో మూడున్నరేళ్లుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్నో విజ్ఞాపనలు, వినతులు ఇచ్చారన్నారు. అయినా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఎస్.పుష్పకుమారి పాల్గొన్నారు.

'నులిపురుగుల నిర్మూలన'ను విజయవంతం చేయాలి

జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14న నిర్వహించబోయే జాతీయ నులిపురుగు నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యతేజ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 19 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు డీవార్మింగ్ టాబ్లెట్లు అందజేయాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ ద్వారా 19 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన ప్రతిఒక్కరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేయడం జరుగుతుందన్నారు. జిల్లా, మండలస్థాయిల్లో వైద్యం, విద్య, ఐసిడిఎస్ శాఖల సమన్వయంతో పని చేసి జాతీయ నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర పొడి చేసి మంచి నీటిలో కలిపి ఇవ్వాలన్నారు. రెండు నుండి మూడు సంవత్సరాలు దాటిన పిల్లలకు ఒక పూర్తి మాత్రను పొడిచేసి మంచినీటిలో కలిపి ఇవ్వాలన్నారు. 3 నుండి 19 సంవత్సరాల మధ్య పిల్లలకు ఒక పూర్తి మాత్రను బాగా నమిలి మింగించి, నీరు తాగించాలన్నారు. అనారోగ్యంగా ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయకూడదని, వారికి నయమైన తర్వాత మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏవైనా కారణాల వల్ల 14వ తేదీ ఆల్బెండజోల్ మాత్రలు వేయని పిల్లలకు ఈ నెల 18వ తేదీన వేస్తారన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి జె.రమణ, డిఇఒ ఆర్.వెంకటరమణ, సర్వశిక్షాభియాన్ పిఒ పి.శ్యామ్‌సుందర్, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, ఐసిడిఎస్ అధికారి బి.సుజతారాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ వి.ప్రసాద్, డిఎల్‌డిఒ కె.కిషోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి జెసి సూర్యతేజ

వైసిపితోనే సామాజిక న్యాయం

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు

ప్రజాశక్తి - ఆచంట

పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ శ్రీరంగనాధరాజు

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వేస్తున్న ప్రతి అడుగులో సామాజిక న్యాయం స్పష్టంగా కన్పిస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆయన గురువారం ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాధికారత, పదవుల్లో సగభాగం వాటాతో మహిళా సాధికారత, అమ్మఒడి, ఇంగ్లీష్ మీడియంతో విద్యా సాధికారత తీసుకొచ్చారన్నారు. మరింత సంక్షేమాన్ని అందుకోవడానికి ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, నాయకులు మనవర్తి విజయకుమార్, అందే నాగ బసవన్న, పెచ్చెట్టి సత్యనారాయణ, గురుజకోట శ్రీనివాస్, ప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: మండలంలోని సిద్దాంతం గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు తమకు డ్రెయినేజీ సమస్య ఇబ్బందిగా ఉందని ఎంఎల్ఎకు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాలంటీర్లు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణతకు గురువుల కసరత్తు

పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పబ్లిక్ పరీక్షలు వచ్చే నెల మొదటి వారం నుంచి జరగనున్నాయి. విద్యాసంవత్సరం ఆరంభం నుంచి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన సంగతి తెలిసిందే. మూడు నెలలుగా అయితే అదనపు సమయం వెచ్చించడం, విద్యార్థులను గ్రేడులుగా విభజించి వెనుకబడిన వారిని దత్తత తీసుకుని వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడం వంటి పనుల్లో ఉపాధ్యాయులంతా మునిగి తేలుతున్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతకు ఏయే చర్యలు తీసుకున్నారు.. ఏయే పద్ధతులు అవలంభిస్తున్నారు అనే అంశాలపై ప్రజాశక్తి పలువురు ప్రధానోపాధ్యాయులను పలుకరిస్తోంది. దానిలో భాగంగా కొందరి కృషి మీ ముందుకు తీసుకొస్తున్నాం.

పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం

టి.హరి ఆనంద ప్రసాద్, వేంద్ర జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం, పాలకోడేరు మండలం

సబ్జెక్టులవారీగా ప్రశ్నాపత్రాలను తయారు చేసి పరీక్షలు నిర్వహించి పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హరిఆనందప్రసాద్ తెలిపారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, ఉత్తీర్ణత, పరీక్షలకు సన్నద్ధం, విద్యార్థులు తీసుకోవాల్సిన మెళకువలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాల నుంచి 65 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. గతేడాది జులై నుంచి ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని పాఠాలు బోధిస్తున్నామని తెలిపారు. నాటి నుంచి నవంబర్ వరకు ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించామని, డిసెంబర్ నుంచి ఉదయం, సాయంత్రం కూడా ప్రత్యేక తరగతులు సబ్జెక్టులవారీ నిర్వహిస్తున్నామని వివరించారు. సబ్జెక్టువారీగా రివ్యూ చేయడంతోపాటు తల్లిదండ్రుల కమిటీతో తరచూ సమావేశాలు నిర్వహించి వారిని అప్రమత్తం చేశామన్నారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా కొత్త పద్ధతుల్లో పాఠాలు బోధిస్తున్నామని చెప్పారు. అలాగే కామన్ ఎగ్జామ్ బోర్డ్, ప్రభుత్వం అందించిన విజయకేతనం మెటీరియల్ ఆధారంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా సి, డి గ్రేడ్ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రతిరోజూ గ్రేడ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో విద్యార్థులను సన్నద్ధం చేస్తూ తమ ఉపాధ్యాయ బృందం ముందుకు సాగుతుందని వివరించారు.

ప్రతి విద్యార్థినీ దత్తత తీసుకుని బోధిస్తున్నాం

వేంద్ర వెంకటేశ్వరరావు, స్వామి జ్ఞానానంద జెడ్‌పి హైస్కూల్, గొరగనమూడి, పాలకోడేరు మండలం

మా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థినీ ఉపాధ్యాయులు దత్తత తీసుకుని బోధన సాగిస్తూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారని గొరుగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేంద్ర వెంకటేశ్వరరావు తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సన్నద్ధత, మెళకువలు, సూచనలు, సలహాలు, ఉత్తీర్ణత వంటి అంశాలపై ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పాఠశాల నుంచి 24 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 45 నిమిషాలపాటు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఒక గంటపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆదివారంతోపాటు మిగిలిన సెలవు రోజుల్లో కూడా ప్రతిరోజూ మూడు గంటలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు ముగ్గురు విద్యార్థుల చొప్పున దత్తత తీసుకుని పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. 40 రోజుల నుంచి సి, డి గ్రేడ్ విద్యార్థులకు ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రోజుకు రెండు ప్రశ్నలు చొప్పున సబ్జెక్టులవారీగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా ఈ విధానంలో పాఠ్యాంశాలను బోధిస్తున్నామని వివరించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడంతోపాటు సబ్జెక్టులవారీగా సూచనలు, సలహాలు అందిస్తూ మెళకువలు చెబుతున్నామన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన పద్ధతుల్లో తర్ఫీదునివ్వడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, తల్లిదండ్రుల కమిటీ సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు 529 మంది విద్యార్థులు : ఎంఇఒ శారదాజ్యోత్స్న

ప్రజాశక్తి - పెనుమంట్ర

పదో తరగతి పరీక్షలకు మండలం నుంచి 529 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధన కోసం ఇప్పటికే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జెడ్‌పి హైస్కూళ్ల నుంచి 410 మంది, ప్రయివేటు స్కూళ్ల నుంచి 87 మంది, బిసి గురుకుల పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పొలమూరు హైస్కూల్ నుంచి 52 మంది, మాముడూరు హైస్కూల్ నుంచి 40, ఆలమూరు హైస్కూల్ నుంచి 38, పెనుమంట్ర హైస్కూల్ నుంచి 79, జుత్తిగ హైస్కూల్ నుంచి 84, మార్టేరులోని ఎస్‌విజిహెచ్ హైస్కూల్ నుంచి 71, బసంతిదేవి హైస్కూల్ నుంచి 46 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు.

జుత్తిగ హైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

గరగపర్రులో డ్వాక్రా నిధులు గోల్‌మాల్..!

మహిళ ఫిర్యాదుతో కదిలిన డొంక - విచారణ చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - పాలకోడేరు


రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

గరగపర్రులో డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన నిధులను గ్రామంలో పని చేసే కొందరు సిబ్బంది గోల్‌మాల్ చేసి కాజేసినట్లు ఆ గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎపిఎం రవికుమార్, డిజిఎం కాంతారావు, సీసీ శారద గురువారం గరగపర్రులో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ విచారణ సమయంలో కొన్నేళ్లుగా జరుగుతున్న అవకతవకలను ప్రాథమికంగా గుర్తించారు. రికార్డులు సక్రమంగా లేకపోవడం, రుణాల మంజూరు, వసూళ్లలో తేడాలు ఉండటం, నగదు వివరాలు అసంపూర్తిగా ఉండటం వంటి అంశాలను గుర్తించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ తనిఖీల్లో లెక్కలు తేలకపోవడంతో తిరిగి శుక్రవారం తనిఖీలు కొనసాగించనున్నామని ఎపిఎం రవికుమార్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సభ్యులు రుణాలు తీసుకోవడంతోపాటు చెల్లింపులు కూడా సక్రమంగా చేసినా అవి రికార్డుల్లో పూర్తిస్థాయిలో నమోదు కాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్త్రీ నిధి రుణాలు కూడా పక్కదారి పట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ తనిఖీల సమయంలో విఒఎలు, ఒబిల ప్రెసిడెంట్లు అందరూ హాజరు కావాలని కోరినా ఒబి ప్రెసిడెంట్లు కొందరు హాజరు కాకపోవడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధుల దుర్వినియోగం భారీ స్థాయిలో జరిగినట్లు ఫిర్యాదుదారు వెంకటలక్ష్మి ఆరోపిస్తున్నారు. శుక్రవారం తనిఖీలను గ్రామంలోని డ్వాక్రా సభ్యులందరి ముందు నిర్వహించాలని ఆమె కోరుతున్నారు.

ఎంఎల్‌సిగా చంద్రశేఖర్‌ను గెలిపించండి

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 13న జరగబోయే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎపి పంచాయతీ ఛాంబర్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు ఒకటో ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి అధికార మదంతో ప్రజాప్రతినిధులు రహస్యంగా వేసిన ఓటు తమకు తెలుస్తుందని భయభ్రాంతులకు గురి చేయడం హాస్యాస్పదమన్నారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ టిడిపి మద్దతు పలుకుతున్న స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు బ్యాలెట్‌లోని 4వ నెంబర్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎటువంటి నిధులూ మంజూరు చేయకుండా గాలికొదిలేసిందని, ఈ తరుణంగా వీరవల్లి చంద్రశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించి జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అన్నారు. ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు మాట్లాడగా నేతలు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్, ఉప్పలపాటి సురేష్‌బాబు, మామిడిశెట్టి ప్రసాద్, గణపతినీడి రామ్మోహన్, వీరవల్లి దుర్గభవాని తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది

జగన్నాథపురంలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల భాగస్వామ్యం, అవగాహనతో కీటక జనిత వ్యాధులను అరికట్టవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి యేలూరి వెంకటలక్ష్మణరావు అన్నారు. మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు పరిశీలన, దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కార్యమాలు గురువారం నిర్వహించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్ల లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య కార్యకర్తలు కోటమ్మ, ఆరోగ్య సహాయకులు హరినాథ్‌బాబు, ఎన్.ప్రసాద్‌బాబు, కాంతారావు, ఎంఎల్‌హెచ్ పి సత్యవాణి, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాలమర్రులో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వాలమర్రు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన నిధులు రూ.ఐదు లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నట్లు సర్పంచి గంటా సత్యనారాయన తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి : పితాని

ప్రజాశక్తి - పెనుమంట్ర

పార్టీలో బాగా పనిచేసేవారికి అవకాశం ఇవ్వాలని, పనిచేయడం లేదని బలవంతంగా తొలగించవద్దని మాజీ మంత్రి, టిడిపి పొలిటికల్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని పొలమూరు, మాముడూరు, పెనుమంట్ర, గరువు గ్రామాల్లో టిడిపి సాధారణ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పితాని సత్యనారాయణ హాజరయ్యారు. పొలమూరులో పార్టీ గ్రామ అధ్యక్షుడు కలిదిండి వివేక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పితాని సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, ఆచంట జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాడు సురేష్‌బాబు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పాలకోడేరు

గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు సిహెచ్‌వి.రంగమనాయుడు అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు గురువారం ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకున్నప్పుడే గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి ప్రసవాలు జరిగేలా మహిళల్లో చైతన్యం కల్పించాలన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి ఔషధాలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా వైద్యురాలు స్వర్ణ నిరంజని, సిహెచ్‌పి ఎం.సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామదేవత పోలేరమ్మ నూతన ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. ఆలయ నిర్మాణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చెట్టు వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సమయంలో జాతర మహోత్సవం జరపడం ఆనవాయితీ. దాతలు, గ్రామస్తులు అమ్మవారి ఆలయం ఏర్పాటు చేయాలని సంకల్పించి శంకుస్థాపనకు పనులు చేశారు. అమ్మవారి విగ్రహ, స్టేజి ఏర్పాటు చేసేందుకు కట్రేడ్డి శ్రీనివాసరావు, కట్రేడ్డి సురేష్ దాతలు ఒక్కొక్కరు రూ.రెండు లక్షల చొప్పున విరాళం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, సీసలి గ్రామ సర్పంచి బిళ్లకుర్తి ధనలక్ష్మి, మాజీ సర్పంచి కట్రేడ్డి వెంకటకృష్ణ చల్లారావు (వేణు), తోట రామస్వామి, గణేశ్న పద్మారావు, గణేశ్న నల్ల శ్రీను, కట్రేడ్డి శ్రీనివాసరావు, కట్రేడ్డి వేణు, నూకల వెంకటస్వామి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని పాలకొల్లు పట్టణ సంక్షేమ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నిక అధికారులుగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఎన్ఎస్.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కె.చిట్టివెంకయ్య వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా వేగేశ్న తిరుపతిరాజు, అధ్యక్షులుగా వంగా నరసింహారావు, ఉపాధ్యక్షులుగా కొల్లి నరసింహమూర్తి, జక్కంపూడి నరసింహారావు, కెవిఎస్ఎల్.నరసింహరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పివి.ప్రతాప్‌రాజు, కోశాధికారిగా మాఘం బాలకొండయ్య ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా కారుమూరి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డ్ పరిధిలో, పాతూరు సబ్‌స్టేషన్‌లో 11 కెవి రిలీయన్స్ ఫీడర్, మహాలక్ష్మి నగర్ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎఇ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. చెట్లు రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, టిటిడి కల్యాణ మండపం ఏరియా, హౌసింగ్ బోర్డు, గణేష్ నగర్, వీకర్స్ కాలనీ ఏరియాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

మొగల్తూరు : మొగల్తూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బళ్ల సురేష్ తెలిపారు. నరసాపురం డివిజన్ పరిధిలో 33 కెవి నూతన లైన్లు ఏర్పాటు చేయనున్నందున సరఫరా నిలిపివేనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814


పాలకొల్లు రూరల్ : వసంతలక్ష్మిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి


తాడేపల్లిగూడెంలో జూనియర్ సివిల్ జడ్జిని సత్కరిస్తున్న పోలీసులు

సాధికారత వైపు మహిళల అడుగులు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురికి సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ ప్రిన్సిపల్ వసంతలక్ష్మిని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఒకే విద్యాసంస్థలో 30 సంవత్సరాలుగా విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ ఇస్తూ ఎంతోమంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. లిమ్కాబుక్ ఆఫ్ రికార్డు సైన్స్ పెయిర్ నిర్వహించడమే కాకుండా దంగేటి జాహ్నవి వంటివారికి నాసాకు వెళ్లడానికి ఆదర్శంగా నిలిచారన్నారు. అంతేకాకుండా సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తూన్నారని చెప్పారు. ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి (బాబ్జి) మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులకు, మహిళలకు ఆదర్శంగా నిలిచి, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న వసంతలక్ష్మికి మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నదుకు మాంటిస్సోరిస్ విద్యాసంస్థలు తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ ఒకే విద్యాసంస్థలో 30 సవంత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లుగా, ఇంజినీరింగ్, చార్టెడ్ అకౌంట్లుగా, ఉన్నతస్థాయిలో ఉండటానికి కృషి చేస్తున్న వీరికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నదుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వసంతలక్ష్మిని స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంటు మద్దాల రాంప్రసాదు అభినందించారు.

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం

తాడేపల్లిగూడెం : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లిగూడెం జూనియర్ సివిల్ జడ్జిని తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ పోలీసులు ఘనంగా సత్కరించారు. స్థానిక సిఐ కార్యాలయ ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగమల్లేశ్వరిని మహిళా పోలీసులు సత్కరించారు. తొలుత కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్ కె.ప్రకాష్‌బాబు, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్, రూరల్ సిఐ మూర్తి, పట్టణ సిఐ నాగరాజు, ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలకొల్లు ఛాంబర్ కళాశాలలో..

పాలకొల్లు : పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సిహెచ్.ఉమాశర్మ మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి సాధికారత వైపు అడుగు వేస్తున్నారన్నారు. అనేక అవరోధాలు అధిగమించేందుకు ఈ వ్యవస్థలో ఉన్న అందరి వ్యక్తుల సహకారంతో ముందుకు వెళ్లాలన్నారు. డాక్టర్ కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు స్వేచ్ఛ స్వతంత్రాలతో ఆధునికత వైపునకు ముందుకు సాగాలన్నారు. యూనియన్ బ్యాంక్ డిజిఎం రామారావు మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలను, హక్కులను వినియోగించుకుని వ్యవస్థలో ఆర్థిక, సామాజిక, రాజకీయంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం ద్వారా కళాశాలకు రూ.లక్ష విలువైన రెండు కంప్యూటర్ సిస్టంలు బహుకరించారు. ఛాంబర్స్ ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మన దేశం ఇతర ప్రపంచ దేశాల చట్టాల కన్నా మంచి చట్టాలను తయారుచేసి అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా ఆస్తి సమానపు హక్కు, వరకట్న నిషేధపు చట్టం, మహిళా రిజర్వేషన్, మహిళా వ్యవస్థాపకత్వ అభివృద్ధి చట్టం వంటి వాటిని అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత సాధ్యమైందన్నారు. మహిళా అధ్యాపకులను బహుమతుల ద్వారా సత్కరించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ టి.ఓల్గా అధ్యక్షత వహించారు. అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఎబిఎస్.మూర్తి, గవర్నింగ్ బాడీ మెంబర్స్ ఇనుకొండ రంగారావు, కంచర్ల వీర్రాజు, నూలి బాబ్జి, డాక్టర్ వర్మ, కామేశ్వరరావు, పాలకొల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, చల్లా ఆదినారాయణ పాల్గొన్నారు.


పాలకొల్లులో బహుమతులు అందుకుంటున్న మహిళలు

పాలకొల్లులో ఎల్ఐసి ఏజెంట్లను సత్కరిస్తున్న సిబ్బంది


పెనుమంట్రలో గర్భిణులకు పండ్లు అందిస్తున్న ఎంపిటిసిలు

ఎల్ఐసి మహిళా ఏజెంట్లకు ఘన సత్కారం

పాలకొల్లు ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బ్రాంచ్ మేనేజర్ రఘుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ రాఘవి మాట్లాడుతూ మహిళలందరూ ప్రతి రంగంలోనూ ముందుండాలన్నారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి గెలిచిన మహిళలకు బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఎబిఎం త్రిమూర్తులు, సుశీల, రమాదేవి, భవాని, పావని పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెనుమంట్ర : రోగులకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మార్టేరు ఎంపిటిసి సభ్యులు కర్రి అనురాధ, నెగ్గిపూడి ఎంపిటిసి సభ్యులు పెనుగొండ లక్ష్మి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారి సహకారాలతో పరిసర ప్రాంతాల గర్భిణులకు పండ్లు, బ్రెడ్, హార్లిక్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గర్భిణులకు వివరించారు. ఆరోగ్య కేంద్రంలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్టేరు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటే ఊరుకోం'

ప్రజాశక్తి - ఉండి

చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమని క్రైస్తవ సంఘ నాయకులు హెచ్చరించారు. క్రైస్ట్ కల్వరి ప్రేయర్ మినిస్ట్రీస్ పాస్టర్ కె.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని చెరుకువాడ గ్రామంలో గత 15 సంవత్సరాలుగా క్రైస్తవ విశ్వాసులతో చర్చి కొనసాగుతుందని క్రైస్తవ సంఘ నాయకులు తెలిపారు. ఆ చర్చి శిథిలావస్థ స్థితిలో ఉండడంతో దానిని పున:నిర్మించడం కోసం తీసివేశారని, మళ్లీ చర్చి నిర్మాణ పనులు ప్రారంభించగా గ్రామానికి చెందిన కొంతమంది మత చాందసవాదులు చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. ఈ విషయంపై ఉండి పోలీస్ స్టేషన్, స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎఫ్‌సిఐ నేషనల్ ప్రెసిడెంట్ పీటర్ కోరారు. చర్చి నిర్మాణాన్ని అడ్డుకుని క్రైస్తవ మనోభావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. చర్చి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

లేకపోతే తాము పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అధికారులు దీనిపై స్పందించి గ్రామసభ ఏర్పాటు చేస్తామన్నారని, లేకపోతే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటూ ఉండి పెద్ద వంతెన సెంటర్లో క్రైస్తవ నాయకులు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌సిఐ స్టేట్ ప్రెసిడెంట్ ఎండి ఇస్మాయిల్, జిల్లా ప్రెసిడెంట్ జె.స్టాన్లీ థామస్, ఎఫ్ఎఫ్‌సిఐ పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ కన్నా, యేవేలు రాజు, సువార్త రాజు, ఉండి, కాళ్ల, ఆకివీడు మండలాల ఎఫ్ఎఫ్‌సిఐ నాయకులు, ఎఐసిఎఫ్ రాష్ట్ర నాయకులు మత్తే రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వేసవి ప్రారంభంలోనే తాగునీటి కొరత

అనాకోడేరు వాసుల ఇబ్బందులు

అడుగంటుతున్న మంచినీటి చెరువు

పట్టించుకోని అధికారులు

తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న మహిళలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రజలకు రక్షిత నీటిని అందించేందుకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యం, గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితులతో నేటికీ కొన్ని గ్రామాల్లో ప్రజలు తాగు సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా పరిధిలో ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు, గ్రామాల్లో మహిళలు వాపోతున్నారు. మండలంలోని అన్నాకోడేరు గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామంలోని ఈలంపుడి పరిధి కృష్ణుడి ఆలయ సమీపంలో ఉన్న వీధిలో తాగునీరు అందడంలేదని ఆ ప్రాంత మహిళలు వాపోతున్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కొరత ఇలా ఉంటే రానున్న రోజుల్లో గుక్కెడు నీరైనా దొరుకుతుందా అని ఆందోళన చెందుతున్నారు.

అడుగంటుతున్న అన్నాకోడేరులో మంచినీటి చెరువు

ఇప్పటికే కాలువల వంతుల వారీ విధానం వల్ల పంచాయతీ మంచినీటి చెరువులు అడుగంటాయి. తమకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని పంచాయతీ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగి అధికారులకు తమ కోడును విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అన్నాకోడేరు గ్రామపంచాయతీ ప్రజలను తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 14న మచిలీపట్నంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని అరాచకాలను నిలదీయడానికి పార్టీ ఆవిర్భవించిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. కౌలు రైతుల కుటుంబాలకు పార్టీ అండగా నిలబడి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం పార్టీ అందిస్తుందన్నారు. కార్యకర్తల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పార్టీ తరపున ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. మచిలీపట్నం సభకు తణుకు నుంచి కార్యకర్తలు భారీ స్థాయిలో వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పంతం నానాజీ, పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ తమరాపు నరసింహరావు, ఇరగవరం మండల అధ్యక్షుడు ఆర్యేటి కాశి, మండపాక పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ శివ నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం గ్రామం, డోర్ నెం. 9-40రు కాపురస్తులు **షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ అబ్దుల్ కలం ఆజాద్,** వయస్సు 64 సంIIలు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది.

నా క్లయింటు అయిన షేక్ మీరా సాహెబ్ గారి కుమారుడు షేక్ అబ్దుల్ కలం ఆజాద్ గారికి తెలంగాణా రాష్ట్రం, కొత్తగూడెం భద్రాద్రి జిల్లా, పాల్వంచ తాలూకా రి.స.నెం. 414/1, 416ర్లు చుIIగుII 200లు స్థలం కలదు. సదరు ఆస్తికి సంబంధించిన నా క్లయింటు పేరున గల ది. 12-07-1999 సంII తేదీ నాటి **నెం. 1467/1999రు** గల ఒరిజినల్ విక్రయ దస్తావేజును నా క్లయింటు ఒక కవరులో పెట్టుకొని ది. 01-03-2023 సంII తేదీన వారి ఇంటి వద్ద నుండి శృంగవృక్షం సెంటర్‌కి జిరాక్స్ తీయించుటకు వెళ్తుండగా మార్గమధ్యములో సదరు ఒరిజినల్ విక్రయ దస్తావేజు పెట్టన కవరు జారి పడిపోయినది. నా క్లయింటు మరలా మార్గమధ్యములోనూ, పరిసర ప్రాంతాలలో వెతికినారు, అయిననూ దొరకలేదు. ఎవ్వరికైన దొరికిన యెడల నా క్లయింటు అయిన షేక్ అబ్దుల్ కలం ఆజాద్ గారి అడ్రెష్‌కు గాని, వారి సెల్ నెం. 9949486104 రుకు గాని తెలియపర్చగలరు.

బొక్కా చంద్రశేఖరరావు
అడ్వకేట్ & నోటరీ, తాలూకా ఆఫీసు ఎదురుగా,
భీమవరం-534201, పIIగోIIజిల్లా
సెల్: 9491172663

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 115/2022

Between:
Valluri Venkateswara Rao and others ...*Petitioners*
AND
Sunkavalli Bhuvana Satya and others ...*Respondents*

Notice to Respondent:
R-1: Sunkavalli Bhuvana Satya, S/o. Rajini Gandhi, age 21 years, D.No. 4-16/1, Near High School, Malakapalli Village, Malakapalli Mandal, W.G.Dist., Pin: 534 340 (Driver of Hyundai Car bearing Regd. No. AP 39 DK 2001)

In the above M.V.O.P. No. 115/2022 the 1st Respondent hearing date stand posted **to 17-03-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing date: 17-03-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram, E.G.Dist.,
Cell: 9849193665
Amalapuram
Dt.27-02-2023

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం ఆచంట పంచాయతీ పరిధి కానుపోతు గుంట గ్రామానికి చెందిన బొక్క మురళి వెంకటకృష్ణ, S/o. బొక్క పేరుమల్ల మాలస్వామికి చెందిన విశాఖపట్నం వారు జారీ చేసిన పాస్‌పోర్టు నెంబర్ **S3654423** ఒరిజినల్ పాస్‌పోర్టు ఈనెల 07-03-2023వ తేదీన కానుపోతుగుంట నుంచి ఆచంట కచేరి సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గమధ్యలో పడిపోయినది. కావునా నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

బొక్క మురళి వెంకటకృష్ణ
S/o. బొక్క పేరుమల్ల మాలస్వామి
హౌస్ నెంబర్ 30-84, కానుపోతుగుంట
ఆచంట, ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్ కోడ్ నెంబరు: 534123
సెల్: 8121971357

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari District
M.V.O.P. No. 164/2022

Between:
Chavatapalli Naga Seetha Ratnam and others ...*Petitioners*
AND
Penmetsa Venkata Ramaraju and others ...*Respondents*

Notice to Respondent:
R-1: Penmetsa Venkata Ramaraju, S/o. Sattiraju, Hindu, age 58 years, Door No. 1-9-3, Adarsha Nagar, Ramalayam, Bhimavaram, W.G.Dist., Pin: 534202 (Driver cum Owner of Car bearing Regd. No. AP 31 CM 6899)

In the above M.V.O.P. No. 164/2022 the 1st Respondent hearing date stand posted **to 31-03-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing date: 31-03-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram, E.G.Dist.,
Cell: 9849193665
Amalapuram
Dt.08-03-2023

కోర్టు ప్రకటన
మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
Creditor I.P. No. 40/2022

పిటిషనరు: పెన్మెత్స వెంకట శివ దుర్గరాజు
రెస్పాండెంట్లు:
అనంతపల్లి వెంకట సత్య వనమరాజు, వగైరా
2వ రెస్పాండెంటు:
అనంతపల్లి లక్ష్మీ నరశింహ మధుకుమార్, S/o. వెంకట సత్య వనమరాజు, D.No. 3-48/1A, విస్సాకోడేరు, పాలకోడేరు మండలం, పIIగోIIజిల్లా.

పిటిషనరు దాఖలు చేసిన పై నెంబరు I.P. నందు 2వ రెస్పాండెంటు అయిన మీకు ఆక్షేపణలు/ వాదన వున్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది. 18-4-2023 సంII తేదీన పగలు 10.30 నిIIలకు** హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని పక్షమున మీకు పరోక్షంగా నిర్ధారణ కాబడును.

గంధం వీరవెంకట నాగేశ్వరరావు
అడ్వకేట్, భీమవరం
సెల్: 9392235067

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, తాడేపల్లిగూడెం వారి కోర్టులో
E.P 38/2022 in O.S. 298/2015

Between:
సత్తి లక్ష్మీదేవి ...*D.H.R*
AND
ఆకుమర్తి పాప వగైరా ...*JDRs*

ప్రకటన

పై దావా గ్రంథములో JDRs అయిన (1) ఆకుమర్తి పాప, W/o. మందులు, వయస్సు 39 సంIIలు, హిందు, స్త్రీ, డో.నెం. 14-17-37/1, వార్డు నెం.24, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, పIIగోIIజిల్లా. (2) ఆకుమర్తి మందులు, S/o. కొర్లపాటి, వయస్సు 44 సంIIలు, హిందు, మగ, డో.నెం. 14-17-37/1, వార్డు నెం.24, యాగర్లపల్లి, తాడేపల్లిగూడెం, పIIగోIIజిల్లా అను మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతూ కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు Substitute Serivce ద్వారా మీకు నోటీసులు జారీ చేయవలసినదిగా ఆర్డరు యిచ్చియున్నారు. సదరు పై నెంబరు Execution Petition ది. 27-3-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున మీరు ది. 27-3-2023వ తేదీ ఉదయం గంII 10.30 నిIIలకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షమున ఈ పిటీషను తీర్మానము చేయబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

తాడేపల్లిగూడెం
09-3-2023
తాడూరి లీలామాధవ్
అడ్వకేట్, తాడేపల్లిగూడెం

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.S No. 3076 OF 2021

Between:
Union Bank of India,
(Erstwhile Andhra Bank Merged in UBI)
Credit Card Division, Koti, Hyderabad,
represented by the Senior Manager (Law)
...Plaintiff
AND
D1. Smt. Veeramsetti Subba Lakshmi, D/o. Sri Raja Vara Prasad, aged about 40 years, Occ: Business, R/o. D.No. 3-7-6, Vungarala Vari Street, Near Round Ramalayam, Kovur, West Godavari District, A.P. - 534350.
D2. Sri Raja Vara Prasad, father name not known to plaintiff, aged about 45 years, R/o. D. No. 3-7-6, Near Round Ramalayam, Vungarala Vari Street, Kovur, West Godavari District, Andhra Pradesh-534350.
...Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,31,854-57Ps (Rupees Two lakhs thirty one thousand eight hundred and fifty four and paise fifty seven only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and the same stands posted to **21-03-2023** for your appearance in person or through duly appointed Advocate at **10-30** A.M and if you fail to so appear, the matter will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAM ADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5, West Prasanth Nagar Colony, Moosarambagh, Hyderabad-500 036